కొత్తకొండ జాతరకు ప్రత్యేక బస్సులు

హుజూరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ బస్టాండ్ నుంచి కొత్తకొండ జాతరకు ఈ నెల 13 నుంచి 16వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శనివారం తెలిపారు. హుజూరాబాద్ నుంచి గోపాల్‌పూర్, పెంచికల్‌పేట, మాణిక్యాపూర్ గ్రామాల మీదుగా కొత్తకొండకు బస్సులు నడుస్తాయన్నారు. పెద్దలకు 50, పిల్లలకు 30 రూపాయల ధరలు నిర్ణయించామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



సంబరాల సంక్రాంతి

సంబరాల సంక్రాంతి వచ్చింది. ఊరూ.. వాడా.. పట్టణం.. నగరం.. అనే తేడా లేకుండా సందడి మొదలైంది. మహిళలు ఇప్పటికే పిండి వంటలు పూర్తి చేసుకుని పండగ పూజలకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో గంగిరెద్దుల వారి సన్నాయిలు, హరిదాసుల కీర్తనలు ప్రారంభమయ్యాయి. యువతులు తమ వాకిళ్లను ముగ్గులతో నింపుతున్నారు. బాలలు గాలిపటాలతో హల్‌చల్ చేస్తున్నారు. మూడు రోజుల పండగను ముచ్చటగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వాసులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

◆ ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

6,7 పేజీల్లో



జిల్లావాసులకు కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం

- గణతంత్ర దినోత్సవంలో పాల్గొననున్న విద్యార్థులు, వృత్తి నిపుణులు

కరీంనగర్ అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవానికి జిల్లా నుంచి వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు వృత్తి నిపుణులు వెళ్లనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపికైన ప్రత్యేక అతిథుల జాబితాను శనివారం ప్రకటించింది. పీఎం యశస్వి విభాగం నుంచి ఎస్ కార్తీక్ (ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్, చింతకుంట), ఎ నిశాంత్ (ప్రభుత్వ బీసీ బాయ్స్ హాస్టల్, మానకొండూర్), హ్యాండీ క్రాఫ్ట్ విభాగంలో కరీంనగర్ శర్మనగర్‌కు చెందిన అర్రోజు అశోక్, అర్రోజు ధనలక్ష్మి ఎంపిక య్యారు. రూరల్ డెవలప్‌మెంట్ విభా గంలో తిమ్మాపూర్ మండలం రేణి కుంట గ్రామానికి చెందిన బొంగోని అంజలి, పీఎం మత్స్యసంపద యోజన విభాగంలో కరీంనగర్‌కు చెందిన మహ్మద్ ఖదీర్ అహ్మద్(నోడల్ అధికారి) ఎంపికయ్యారు. వీరంతా గణ తంత్ర దినోత్సవానికి హాజరు కానున్నారు.

జంక్షన్‌గా కొత్తపల్లి రైల్వే స్టేషన్

- 2027 నాటికి పూర్తి కానున్న మనోహరాబాద్ లైన్
- శరవేగంగా అభివృద్ధి పనులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కొత్తపల్లి రైల్వేస్టేషన్ కొత్త హంగులు సంతరించు కుంటున్నది. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే పురోగతిలో ఉండడంతో కొత్తపల్లి రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మారనున్నది. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ నిర్మాణ పనులు 2027 నాటికి పూర్తి చేయనున్నట్లు కేంద్ర మంత్రి బండి సజంయ్‌కుమార్ రైల్వే అధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో ప్రకటించారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్ విస్తీర్ణాన్ని పెంచడంతో పాటు జంక్షన్ ఏర్పాటుకు అవసరమైన అన్ని పనులను చురుకుగా చేస్తున్నారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్ పరిధిని పెంచి జంక్షన్ ఏర్పాటుకు అనువైన ఏర్పాట్లను అధికారులు చేపడుతున్నారు. స్టేషన్ అభివృద్ధి కోసం అన్ని వసతులతో నిర్మాణానికి 60 కోట్ల రూపాయలతో పనులను పూర్తి చేస్తున్నారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151.4 కిలో మీటర్ల మేర రైల్వేలైన్ నిర్మాణానికి 2016 జూలై 21న కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 1,160.48 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించినా ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి అంచనా వ్యయం పెరిగింది. ప్రస్తుత అంచనా ప్రకారం 2,780.78 కోట్ల రూపాయలు ఖర్చు కానున్నాయి. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ నిర్మాణానికి ఇప్పటికే 1,400 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు 76.135 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. 75 కిలోమీటర్లకు పైగా పనులు చేపట్టాల్సి ఉంది. 2024-25 బడ్జెట్‌లో 350 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. అందులో 262.93 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. సెప్టెంబరు నాటికి సిద్దిపేట-రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మరో 30 కిలోమీటర్ల రైల్వే లైన్ పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్ల నుంచి కొత్తపల్లి వరకు 38.6 కిలోమీటర్ల రైల్వే ట్రాక్ పనులు చేపట్టాల్సి ఉంది. సిరిసిల్ల నుంచి కొత్తపల్లి వరకు ట్రాక్ నిర్మాణ పనులు పూర్తయ్యేలోపే కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను పూర్తిగా జంక్షన్‌గా మార్చేందుకు అవసరమైన పనులను పూర్తి చేస్తున్నారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్ నూతన హంగులతో జంక్షన్‌గా కొత్త రూపును సంతరించుకుంటున్నది.

పలు అభివృద్ధి పనులు

కొత్తపల్లి రైల్వే స్టేషన్ జంక్షన్‌గా మార్చేందుకు రైల్వేస్టేషన్ పొడవు 1800 మీటర్లు, వెడల్పు 175 మీటర్లతో కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్ వద్ద మూడు రైల్వే లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వే లైన్‌లో రైళ్ల రాక పోకలు కొనసాగుతున్నాయి. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తయితే కొత్తపల్లి రైల్వే స్టేషన్ వద్ద మూడు లైన్లు ఏర్పాటు కానుండడంతో ఈ స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చి అభివృద్ధి చేస్తున్నారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను అధునాతన హంగులతో తీర్చిదిద్ది జంక్షన్‌గా మార్చనున్నారు.

గ్రానైట్ రవాణా ఇక్కడి నుంచే...

ఉమ్మడి జిల్లాలో గ్రానైట్ వ్యాపారం జోరుగా సాగుతున్నది. ప్రస్తుతం గ్రానైట్ రాళ్లను లారీల ద్వారా కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి గూడ్స్ రైళ్ల

మిగతా 8వ పేజీలో...

పత్తి కొనుగోళ్లలో సీసీఐదే పైచేయి

- 1.72 లక్షల క్వింటాళ్లతో నాలుగేళ్ల రికార్డు బ్రేక్



జిన్నింగ్ మిల్లులో దిగుమతి అవుతున్న పత్తి

జమ్మికుంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో ఈసారి పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పైచేయి సాధించింది. ప్రైవేట్ ట్రేడర్స్ కంటే 70,240 క్వింటాళ్ల అధికంగా పత్తిని కొని నాలుగేళ్ల రికార్డును బ్రేక్ చేసింది. 2019లో ప్రైవేట్ కంటే 400 క్వింటాళ్ల సీసీఐ అధికంగా కొనుగోలు చేసింది. 2024 అక్టోబరు 23న సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించింది. అప్పటి నుంచి

2019-20 నుంచి జమ్మికుంట మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ల వివరాలు

సంవత్సరం	ప్రైవేట్ వ్యాపారులు (క్వింటాళ్లలో..)	సీసీఐ (క్వింటాళ్లలో..)
2019-20	2,38,900	2,39,300
2020-21	1,66,000	58,500
2021-22	2,83,100	--------
2022-23	5,09,900	--------
2023-24	5,00,340	78,450
2024-25 (జనవరి 10 వరకు)	1,01,760	1,72,000

నవంబరు 20 వరకు నామమాత్రంగా కొనుగోలు చేసింది. యార్డులో అప్పటి వరకు ప్రైవేట్ వ్యాపారులదే హవా కొనసాగింది. క్వింటాల్‌కు అత్యధికంగా 6,800 రూపాయల ధర చెల్లిస్తూ వచ్చారు. ప్రభుత్వ మద్ధతు ధర 7,521 ఉండగా, క్వింటాల్‌కు 721 రూపాయలు రైతులు నష్టపోవాల్సి వచ్చింది. నవంబరు 21 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లలో దూకుడు పెంచింది. రెండు నెలల వ్యవధిలో 1.72 లక్షల క్వింటాళ్ల పత్తి కొన్నది. ప్రైవేట్ వ్యాపారులు ఇప్పటి వరకు 1,01,760 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. ప్రైవేట్ కంటే సీసీఐ అధిక మొత్తంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీఐ, ప్రైవేట్ కొనుగోళ్లు పారదర్శకంగా జరిగాయి

- ఆర్ మల్లేశం, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ, ప్రైవేట్ ట్రేడర్స్ ఎలాంటి లోటుపాట్లు లేకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టారు. మేము ఎప్పటికప్పుడు కొనుగోళ్లను దగ్గరుండి పర్యవేక్షించాం. ఇప్పటి వరకు ప్రైవేట్ ట్రేడర్స్ కంటే సీసీఐ కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. సీజన్ ప్రారంభంలో పత్తిలో తేమ శాతం ఎక్కువ ఉండడం వల్ల సీసీఐ కొనలేదు. తేమశాతం తగ్గిన తర్వాత సీసీఐ కొనుగోళ్లలో వేగం పెంచింది.

త్వరలో బీజేపీ జిల్లా కమిటీ



- 21 మండలాలకు అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యుల ప్రకటన
- మండల కమిటీల నియామకానికి కసరత్తు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించిన బీజేపీ జిల్లాలోని 21 మండలాలకు అధ్యక్షులను ప్రకటించింది. సంక్రాంతి నాటికి జిల్లా కమిటీని ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నది. మండల కమిటీలకు అధ్యక్షులను ఎంపిక చేసేందుకు సీనియర్ నేతలతో త్రిసభ్య కమిటీని నియమించింది. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల అంజనేయులు, సీనియర్ నాయకులు కన్నెబోయిన ఓదెలు ఈ త్రిసభ్య కమిటీలో ఉన్నారు. ఈ కమిటీ మండల శాఖ అధ్యక్షులతో పాటు, జిల్లా కౌన్సిల్ సభ్యులను నియమించింది. ఈ నెల 15లోగా జిల్లా కమిటీని ప్రకటించనున్న నేపథ్యంలో 21 మండల కమిటీల అధ్యక్షులను ప్రకటించారు. త్వరలో మండల కమిటీలతోపాటు జిల్లా కమిటీని నియమించనున్నారు. జిల్లాలో పార్టీ పదవులు పొందే విషయంలో నేతల్లో పోటీ నెలకొన్నా ఎవరు అసంతృప్తికి లోనుకావద్దని బీజేపీ పనిచేసే వారికి అవకాశాలు ఉంటాయని నాయకులు తెలిపారు.

ఐదు జోన్లుగా కరీంనగర్ కార్పొరేషన్

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఐదు జోన్లుగా విభజించారు. ఒక్కో జోన్‌కు అధ్యక్షుడితోపాటు కార్యవర్గాలను నియమించనున్నారు. జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీలను మండలాలుగానే పార్టీ పరిగణిస్తున్నది. జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వస్తూ ఇతర జిల్లాల్లో ఉన్న మండలాలను ఈ జిల్లా మండలాలుగానే పార్టీ పరిగణిస్తున్నది. జిల్లావ్యాప్తంగా పార్టీ గుర్తించిన 28 మండలాలకు గాను 21 మండలాల అధ్యక్షుల పేర్లను ప్రకటించింది. జిల్లా పరిధిలో గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ సాధించిన ఓట్లలో సగం మేరకు సభ్యత్వాలు సేకరించాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 2.2 లక్షల మందిని పార్టీలో సభ్యులుగా చేర్చుకున్నారు. జిల్లాలోని 28 పార్టీ మండలాల్లో 1,338 బూత్‌లు ఉన్నాయి. 21 మండలాల్లో బూత్ కమిటీలు పూర్తి చేసిఅధ్యక్షుల పేర్లను వెల్లడించారు. అత్యధిక గ్రామ పంచాయతీలను, ఎంపీటీసీ పదవులను, జడ్పీటీసీ పదవులను కైవసం చేసుకొని వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలని ఆ పార్టీ పథక రచన చేస్తున్నది. జిల్లావ్యాప్తంగా 2.2 లక్షల మందిని సభ్యులుగా చేర్పించారు. ప్రస్తుతం మండల అధ్యక్షుల నియామకం పూర్తవడంతో క్షేత్ర స్థాయికి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని బీజేపీ నాయకులు భావిస్తున్నారు.

బీజేపీమండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వీరే

శనివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల పరిశీలకులు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు మండల అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యుల పేర్లను ప్రకటిం చారు. కరీంనగర్ రూరల్ మాడిశెట్టి సంతోష్‌కుమార్, కొత్తపల్లి జోన్ ముతూనూరి హరిష్, కొత్తపల్లి రూరల్ కుంట తిరుపతి, కరీంనగర్ సౌత్‌జోన్ బండారు గాయత్రి, మానకొండూర్ కంది రాజిరెడ్డి, శంకపట్నం ఏనుగుల అనిల్, బెజ్జంకి మండలానికి కొలిపాక రాజును ఎంపిక చేశారు. ఇల్లంతకుంట మండలానికి భూమల అనిల్, గన్నేరువరం తిప్పర్తి నికేష్, హుజూరాబాద్ టౌన్ తుర్పాటి రాజు, జమ్మికుంట టౌన్ కోలకాని రాజు (రవిప్రసాద్), ఇల్లందకుంట మండలానికి బైరెడ్డి రమణారెడ్డిని నియమించారు. వీణవంక మండలానికి బత్తిని నరేష్‌గౌడ్, కమలాపూర్ ర్యాకం శ్రీనివాస్, చొప్పదండి టౌన్ చిల్ల శ్రవన్‌కుమార్, చొప్పదండి రూరల్ మొగిలి మహేష్, రామడుగు మోడి రవీందర్, గంగాధర పంజాల ప్రశాంత్‌గౌడ్, బోయినపల్లి ఈదపల్లి పరుశురాం, మల్యాల గాజుల మల్లేశం, కొడిమ్యాల మండలానికి బండ నరిసంహారెడ్డిని ఎంపిక చేశారు.జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పండి శ్రీనివాస్ యాదవ్, చంద్రశేఖర్ వేముల, వేముల అనిల్‌కుమార్, అడిచర్ల రాజు, అప్పాని తిరుపతి దాసారపు నరేందర్, బుర్ర మల్లేశం, బత్తిని సాయిగౌడ్, అరికంతాపు అంజిరెడ్డి, రావుల వేణు, దొంతుల రాజకుమార్, గుత్తికొండ రాంబాబు, దాసరి భాస్కర్, బండా రి సుధాకర్, గుండేటి శివకుమార్, గొల్ల గట్టయ్య, ఉప్పు శ్రీనివాస్, సదాల భాస్కర్, ఊదరి నరింహాచారి, సంగాని రవి, చల్ల శ్రీనివాస్‌రెడ్డి పేర్లను ప్రకటించారు.

బైపాస్ రోడ్‌లో ట్రాఫిక్ జామ్



తీగల వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

కరీంనగర్ క్రైం, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ శివారులోని తీగల వంతెన చౌరస్తాలో శనివారం రాత్రి నాలు గు వైపులా భారీగా వాహనాలు నిలిచి పోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం రాత్రి భారీ సంఖ్యలో వాహనాలు ఎక్కడి కక్కడ నిలిచిపోయాయి. గంటకు పైగా వాహనాలు రోడ్లపై నుంచి కదలక పోవడంతో వాహనదారులతో పాటు హౌ సింగ్‌బోర్డు కాలనీవాసులు, ఆటోనగర్ వాసులు, స్థానికులు సమస్యలను ఎదుర్కొ న్నారు. ట్రాఫిక్ పోలీసులు చౌరస్తాల్లో ఉండి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫొటోలు తీయడంలో ఉన్న శ్రద్ధను ట్రాఫిక్ నియం త్రణలో కనబరచడంలేదని విమర్శిస్తున్నారు. సంక్రాంతి సెలవులు శనివారం నుంచి ప్రారంభం కావడంతో హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి గోదావరిఖని వైపు, కరీంనగర్ నుంచి హైదరాబాద్, వరంగల్ వైపు స్వగ్రామాలకు కుటుంబసభ్యులతో కార్లు, ద్విచక్ర వాహనాల్లో బయలుదేరారు. శనివారం సాయంత్రం నుంచి కరీంనగర్‌తో పాటు బైపాస్ రోడ్‌లో ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగింది. తీగలవంతెన వద్ద చౌరస్తాలో నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు లేరు. వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది.

బస్టాండ్‌లో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి



కరీంనగర్ బస్టాండ్‌లో అధికారులకు సూచనలు ఇస్తున్న ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులు బస్టాండ్‌లలో అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి అన్నారు. శనివారం కరీంనగర్ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ పండుగ సందర్భంగా బస్టాండ్‌లో రద్దీ ఎక్కువగా ఉండనున్నందున పిక్‌పాకెటింగ్, చైన్ స్నాచింగ్ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ భూపతిరెడ్డి, ఒకటో డిపో మేనేజర్ విజయ మాధురి, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేష్, కార్గో ఇన్‌చార్జి రామారావు, వన్‌టౌన్ ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల పేరు చెప్పి డబ్బులు వసూలు

● ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

కరీంనగర్ క్రైమ్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులమని చెపుతూ వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తపల్లి ఎస్‌ఐ సాంబ మూర్తి తెలిపారు. హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ అజ్మత్‌పాషా శుక్రవారం తన ఆటోలో నలుగురిని తీసుకుని వేములవాడ దర్శనానికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున తిరిగి వెళుతుండగా కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని అసిఫ్‌నగర్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఆటోను ఆపారు. తాము పోలీసులమని చెప్పి వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగారు. మొబైల్ ఉన్న ధ్రువీకరణ పత్రాలను చూపిస్తే అవి సరిపోవని, ఒరిజినల్ పత్రాలు చూపించాలని, లేకపోతే డబ్బులు చెల్లించాలని బెది రించారు. అనుమానం వచ్చిన అజ్మత్‌పాషా వారి గుర్తింపు కార్డులు చూపించాలని అడగడంతో అక్కడి నుంచి పారిపోయారు. దీంతో అతడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు బోయినపల్లి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చక్రాల రాజు, గొట్టెముక్కల విజయ్ అనే యువకులను అదుపులోకి తీసుకున్నారు.

కోడిపందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

● ఇద్దరి అరెస్టు, కోడిపుంజు స్వాధీనం



పట్టుబడిన నిందితుడు

కరీంనగర్ క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని రేకుర్తిలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన లో రేకుర్తి ఇందిరమ్మకాలనీకి చెందిన సయ్యద్ బురాన్(54), ఒక మైనర్ పట్టుబడ్డారు. కోడి పుంజును, 500 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని కొత్తపల్లి పోలీసులకు అప్ప గించినట్లు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ గోపతి నరేందర్ తెలిపారు. నిందితులపై కొత్తపల్లి పోలీసుఠాణాలో సంబంధిత సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశామని కొత్తపల్లి ఎస్‌ఐ సాంబమూర్తి తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

శంకరపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గుట్టపైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామా నికి చెందిన పేరాల శ్రీకాంత్‌రావు (41) ఈ నెల 9న రాత్రి కొత్తగట్టు గుట్ట మీద పురుగుల మందు తాగి తండ్రి ప్రభాకర్‌రావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని శ్రీకాంత్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు కుదరడం లేదని మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, మృతిపై ఎలాంటి అనుమానం లేదని, మృతుడి తండ్రి ప్రభాకర్‌రావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

గూడ్స్ వ్యాన్‌ను ఢీకొన్న లారీ : డ్రైవర్‌కు తీవ్రగాయాలు.

మానకొండూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ సమీపంలో గూడ్స్ వ్యాన్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ నుంచి కరీంనగర్ వెళ్తున్న గూడ్స్ వ్యాన్‌ను హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాను బోల్తా పడగా డ్రైవర్ సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగరేణి సెక్యూరిటీగార్డు ఆత్మహత్య

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 ఏరియా ఎస్‌అండ్‌పీసీ విభాగం సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆవుల శివప్రతాప్(49) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని చౌరస్తా ఏరియాలో ఉండే శివప్రసాద్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో శివప్రసాద్ ఆచూకీ కోసం గాలించారు. గోదావరిఖని మిలీనియం క్వార్టర్స్ వెనక చెట్ల పొదల్లో చెట్టుకు లుంగీతో ఉరి వేసుకున్న శివప్రసాద్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

సోషల్ మీడియాలో అసభ్యకరంగా మహిళల ఫొటోలు

జగిత్యాల క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దొంగచాటుగా మహిళల ఫొటోలు తీసి, ఇన్‌స్టాగ్రాంలో పోస్టుచేసిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించిన బాధిత మహిళలు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా మార్కెట్, బస్టాండ్, షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో సంచరించే మహిళల ఫొటోలను వారికి తెలియకుండా దొంగచాటుగా తీస్తూ వాటిని ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేస్తున్నాడు. మహిళల ఫొటోలు ఇన్‌స్టాగ్రాంలో చూసి బాధిత మహిళలు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. సంబంధిత ఐడీని గుర్తించి పోస్టులు చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఎనమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. శనివారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేశామని, విభూతి రాజేష్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

పుస్తెల తాడు అపహరణ

ధర్మపురి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుగుణమ్మ అనే మహిళను గుర్తు తెలియని మహిళ కత్తితో బెదిరించి రెండు తులాల బంగారు పుస్తెల తాడు శనివారం అపహరించింది. మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న సుగుణమ్మ వద్దకు సదరు మహిళ వచ్చి కత్తి చూపించి బెదిరించింది. అనంతరం ఆమె మెడలోని పుస్తెల తాడు ఎత్తుకెళ్లింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఉదయ్‌కుమార్ వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కథలాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాల క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ఘటనలో శనివారం సాయంత్రం భీమారం మండలం రాజలింగంపేటకు చెందిన గుగ్గిళ్ల గంగరాజం (52) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో రాంచంద్రం కథనం ప్రకారం.. గంగరాజం చింతకుంటకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బైక్‌పై తిరుగు ప్రయాణంలో తాండ్ర్యాల క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన రుద్రంగికి చెందిన వ్యక్తి వేగంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన గంగరాజంను ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు.

నరసింహుడి సన్నిధిలో లోకాయుక్త చైర్మన్ పూజలు



లోకాయుక్త వెంకటరాములును సన్మానిస్తున్న ఈవో సంకటాల శ్రీనివాస్

ధర్మపురి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని తెలంగాణ లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సీవీ వెంకటరాములు శనివారం సందర్శించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణయ్య, సూపరిం టెండెంట్ ద్యావల్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంబరాల సంక్రాంతి



● ముగ్గుల ప్రాశస్త్యం....

కరీంనగర్ కల్చరల్: సంక్రాంతి లక్ష్మీ ఆగమనానికి సంకేతం. శ్రీమన్నారాయణునితో కలిసి లక్ష్మీదేవి రంగురంగుల ముగ్గుల రథానెక్కి వస్తుందంటారు. ఈ రోజు ముగ్గులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. పూర్వకాలం ఒక గ్రామంలోని వాడలో తొలి ఇంట వేసిన రథం ముగ్గును కలుపుతూ అన్ని ఇళ్ల వారు ముగ్గులను వేస్తూ అందరికీ శుభాలు కలగాలని ఆశించేవారు. ఇప్పుడు ఎవరి ఇళ్ల ఎదుట వారు అందమైన విభిన్న రూపాల్లో వివిధ రంగులతో ఉన్న ముగ్గులు వేస్తున్నారు. సామాజిక ప్రసార మాధ్యమాల్లో వారు వేసిన ముగ్గులను పెట్టి ఆనందిస్తున్నారు. లక్ష్మీతోపాటు సంక్రాంతి పురుషుడు, బలి చక్రవర్తి ఇంటికి వచ్చి శుభాలనిస్తారనే భావనతో ప్రతి ఇంటిని ఆవు పేడతో అలికి ముగ్గులు పెట్టి పేడతో గొబ్బెమ్మలను తయారు చేసి, పసుపు కుంకుమలను అలంకరించి కూరపిండి ఆకు, రేగుపళ్లు, నువ్వులు పెట్టి ముగ్గులో ఉంచుతారు. రాక్షసుల బాధ భరించలేని లక్ష్మీదేవి గోమయంలో దాగి ఉండగా ఆ రూపమే గొబ్బెమ్మ అని చెప్పుతూ పూజించే సాంప్రదాయం అనాదిగా వస్తుంది. చిన్నా పెద్దా తలంటు స్నానాలాచరించి, నూతన వస్త్రాలు ధరించి పెద్దలకు నమస్కరించి తమ పితృ దేవతలకు ఉత్తమ లోకాలు ప్రాప్తించాలని అనేక దానాలు చేస్తారు. సకల సౌభాగ్యాలు కలగాలని పిండి వంటలు చేసి పితృ దేవతలకు, నివేదన చేసి తాము తింటారు. హరిదాసులు, గంగి రెద్దుల వారు, బసవన్నలు, జంగమ దేవరలు, బుడబుక్కల వారికి ధాన్యాదులు దానంచేస్తారు. మహిళలు పౌష్య లక్ష్మికి స్వాగతం పలుకుతూ భర్తలు పండించిన ధాన్యాదులను గాదెలలో నింపుకొని మురిసిపోతారు. మహిళలు, యువతులు నోములు పంచుకొని వాయినాలు ఇచ్చుకొని పెద్దల, ముత్తైదువుల ఆశీస్సులు పొందుతారు.







● బసవన్నల సందడి

సిరిసిల్ల (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేళ గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల పాటలతో గ్రామాలు, పట్టణాల్లో సందడి నెలకొంటుంది. సంక్రాంతి పండుగకు రైతుల కష్టానికి ప్రతి ఫలంగా ధాన్యం ఇంటికి చేరుతుంది. ఈ క్రమంలో గంగిరెద్దులవారు సంక్రాంతి పండుగకు కొన్ని రోజుల ముందు నుంచే ఊరూరా సంచారం చేస్తారు. మూడు నాలుగు కుటుంబాలు గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తాయి. ప్రదర్శనలిస్తూ ఆ ఊరు జనం ఇచ్చే ధాన్యం, డబ్బు తీసుకుంటాయి. ఈ సందర్భంగా బసవన్నలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. గంగిరెద్దలవారు సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగంట, నెత్తిన రంగుల తల గుడ్డా, మూతి మీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, వారు వీరు ఇచ్చిన నల్లకోటు, భుజం మీద కండువ, చేతికి వెండి మురుగులు, నోసట నామాలతో కనిపిస్తారు. వారి ఆటల్లో ఎద్దు నోటిలో తమ మెడను ఇరికించి చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెలతో బసవన్న నృత్యం చేయడం ఆకట్టుకుంటుంది.

● ఇళ్లలో పిండివంటల ఘుమఘుమలు
● గ్రామాల్లో గంగిరెద్దులు.. హరిదాసులతో పండుగ శోభ
● వాకిళ్లలో రంగవల్లులు
● నోముల పంపిణీకి అతివలు సిద్ధం

● హరిదాసులు ప్రత్యేక ఆకర్షణ

సిరిసిల్ల (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు మరో ఆకర్షణ హరిదాసుల ఆటాపాట. పండగవేళ ఉదయమే 'హరిలో రంగ హరి' అంటూ హరిదాసులు ఇంటింటా తిరుగుతారు. ప్రత్యేక వేషధారణ, కాషాయం లేదా ఎరుపు ధోవతి, తిరునామాలు, మెడలో పూలదండ, తలపై పూలతో అలంకరించిన అక్షయపాత్ర, భుజానికి తంబూర చేతుల్లో చిరుతలతో కనిపిస్తారు. సంక్రాంతి వేళ ఇంటింటా తిరుగతూ ఆదాయాన్ని సమకూర్చుకుంటారు. ప్రజలకు సకల శుభాలు కలగాలంటూ భగవంతున్ని వేడుకుంటూ పాటలు పాడుతారు.





నులి వెచ్చని చలిమంటలు.. ఆడపడుచుల వేలి కొసలలో రంగువల్లుల రూపంలో దాగిన అద్భుత ప్రతిభ.. ఇళ్ల ఎదుట ఇంద్రధనుస్సుల వంటి ముగ్గులు.. నింగిన గాలి పటాలై ఎగిరే మనసులు.. పసిడి పంటలు.. భోగి పండ్లు, బొమ్మల కొలువులు, పిండి వంటలు, గొబ్బిళ్లు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, బుడుబుక్కల వారి ఢమరుక శబ్దాలు, ఆలయాల్లో జే గంటలు.. ఇదే తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి. నూతన క్రాంతి పథంలో పయనించేందుకు సంక్రాంతి పర్వదినం రాబోతుంది. ఈ పండుగకు మహిళలు, యువతులు ముగ్గులతో, చిన్నారులు, యువత నింగిలో పతంగులను ఎగురవేస్తూ స్వాగతం పలుకుతున్నారు.



● కనువిందు చేసే పతంగులు...

సాయంత్రం చిన్నారులు, యువత గాలి పటాలనెగరేస్తూ విశాల విశ్వంలో తామొక్కరే అన్నట్లుగా ఆనందంతో, ఆహ్లాదంతో ఊహల్లో తేలిపోతారు. ఇదో ఘనంగా న్వహించే వేడుక. పతంగులను తయారు చేయడానికి, కొనడానికి ముందస్తుగానే సిద్ధమవుతారు. కొన్ని ప్రాంతాల్లో పతంగుల పోటీలు కూడా నిర్వహిస్తారు. విభిన్న ఆకృతుల్లో పతంగులను తయారు చేసి లేదా కొని కనువిందు చేసే వాటిని విశాల ఆకాశంలో వదులుతూ వాటి పయనాన్ని చూస్తూ ఆనందిస్తారు. ఎంత ఎత్తుకు ఎగిరితే అంత గొప్పగా భావిస్తారు. సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయనే సూచన మేరకే ఈ పతంగుల ఎగిరివేత అని అంటుంటారు.



● మార్కెట్‌లో సందడి

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వచ్చేసింది. ఈ పండుగకు కావాల్సిన ముగ్గులు, నోములు, పూలు, పండ్లు, వస్త్రాల కొనుగోళ్లు మార్కెట్‌లో జోరుగా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా కొనుగోళ్లతో మార్కెట్ కిటకిటలాడుతోంది. ఏ షాపు చూసినా జనంతో నిండుగా కనిపిస్తోంది. 13, 14, 15 తేదీల్లో పండుగను జరుపుకోనున్నారు. ఈ దిశలో కొనుగోలు కాస్త ముందుగా జరిగితే బాగుంటుందని భావించిన జనం పండుగకు కావల్సిన వస్తువుల కొనుగోళలలో నిమగ్నమయ్యారు.

● ముగ్గుల రంగులు...

టవర్‌సర్కిల్, పొట్టి శ్రీరాములుచౌక్, మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయం ప్రాంతంతోపాటు రోడ్లపై ముగ్గుల రంగుల షాపులు వెలిశాయి. మహిళలు ముగ్గుల కోసం రంగులు కొనుగోలు చేస్తున్నారు. మెరుపుల కలర్‌లు పావు కిలో ప్యాకెట్ 20 నుంచి 30 రూపాయల వరకు పలుకుతుండగా మామూలు రంగులు 50 గ్రాములకు 20 రూపాయలు పలుకుతున్నాయి.



ముగ్గుల సాంచెలు, గిరకలు 10 నుంచి 25 రూపాయల వరకు లభిస్తున్నాయి.

● నోములకు గిరాకీ బాగా పెరిగింది. పలు ప్రాంతాల నుంచి నోము వస్తువులు తీసుకువచ్చి మార్కెట్‌లో 10 రూపాయల నుంచి 3 వేల వరకు అమ్ముతున్నారు. చిన్నగిన్నెలు, స్టీల్ సామగ్రి, పూజా సామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు, దేవతావిగ్రహాలు, మొంటెల వాయినాలు లభిస్తున్నాయి.

● చిలకలు, బత్తీసలు...

పిల్లలకు భోగి పండ్లతో పాటు చిలకలు, బత్తీసల దండలు వేయడం ఆచారంగా వస్తోంది. మహిళలు నోములలో చిలకలు ఉంచి ఇస్తారు. చిలకలకు, బత్తీసలకు గిరాకీ పెరిగింది. 40 రూపాయలకు పావుకిలో చొప్పున అమ్ముతున్నారు.

● పూలు, పండ్లు... గొబ్బెమ్మల సామగ్రి...

మార్కెట్‌లో పూలు, పండ్లు విరివిగా లభిస్తున్నాయి. బంతి, చేమంతి, మల్లె వంటి పూలు 35 రూపాయలకు పావుకిలో, 50 రూపాయలకు అరకిలో చొప్పున అమ్ముతున్నారు. గ్రామీణ ప్రాంత రైతులు, మహిళలు గొబ్బెమ్మల సామాగ్రి, మామిడాకు, గుమ్మడికాయలు, రేగుపండ్లు, గరిక, నవ ధాన్యాలు, పేడ తెచ్చి అమ్ముతున్నారు. రేగు పండ్లకు గిరాకీ పెరిగింది.



● రెడీమేడ్ ఫుడ్స్‌కు గిరాకీ

ఇళ్లలో సంక్రాంతి సందడి మొదలైనట్లుగానే మార్కెట్‌లో సైతం నోరూరించే రకారకాల పిండి వంటలు చేసి ఇస్తున్నారు. ప్రస్తుతం పిండి వంటలకు గతంలో కంటే డిమాండ్ పెరిగిందని దుకాణాల యజమానులు చెబుతున్నారు. ఉద్యోగ రీత్యా నగరాల్లో, పట్టణాల్లో ఉండేవాళ్లు, చిన్న చిన్న కుటుంబాలకు చెందిన వాళ్లు, సొంతూళ్లకు వెళ్లలేని వారు ఎక్కువగా రెడీమెడ్ పిండి వంటకాలను కొంటున్నారు. గారెలు, అప్పాలు, అరిసెలు, చకినాలు ఎక్కువగా కొంటున్నారు. దీంతో పది మందికి ఉపాధి లభించడంతోపాటు మంచి ఆదాయం లభిస్తుందని దుకాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కిలోకు రూ. 280 నుంచి రూ. 350 వరకు విక్రయిస్తున్నారు.



● నోరూరించే పిండి వంటలు



జగిత్యాల (ఆంధ్రజ్యోతి): సరదాల సంక్రాంతి వచ్చింది. ప్రతి ఇల్లు పిండి వంటలతో ఘుమఘుమలాడుతోంది. చకినాలు, గారెలు, అరిసెలు, నువ్వుల లడ్డులు, మురుకులు, కారప్పూస, జంతికలు,చేగోడీలు, రవ్వ లడ్డులు, కారా బూంది, బూంది లడ్డూలను మహిళలు తయారు చేస్తున్నారు. మూడు రోజుల సంక్రాంతి పండుగ కోసం పిండి వంటల తయారీలో మహిళలు బిజీబిజీగా కనిస్తున్నారు. ఇంటిల్లిపాది పిండి వంటలు తయారు చేయడంలో నిమగ్నం కావడంతోపాటు ఇరుగు, పొరుగు, కాలనీ వాసులు, బంధు, మిత్రులను ఆహ్వానిస్తారు. మరికొందరు ఉరుకులు, పరుగుల జీవితంలో ఇంట్లో వంటకాలు చేసుకోవడం తగ్గించి మార్కెట్లో దొరికే వాటిపైనా ఆధారపడుతున్నారు. ఇంట్లో మూకుడు పెట్టాలని, పిండి వంటలు చేయాలని వస్తున్న సంప్రదాయం ప్రకారం పలువురు మహిళలు పిండి వంటలు చేస్తున్నారు.

సంక్రాంతి వస్తే సందడే సందడి

- అయిత అనిత, జగిత్యాల



సంక్రాంతి వచ్చిందంటే చాలు.. ఏ ఇంట చూసినా సందడి కనిపిస్తుంది. వారం రోజుల ముందు నుంచే పిండి వంటల తయారీ, కొత్త బట్టలు కుట్టించుకోవడం, పతంగులు, గంగిరెద్దుల ఆటలు పండగకు మరింత శోభను తెచ్చిపెడుతాయి. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలను మరవకుండా ఇంటిల్లిపాది ఆనందాలతో గడుపుతుంటారు.

పిండి వంటలు చేయాల్సిందే..

- అడిగొప్పుల రజిని, జగిత్యాల



సంక్రాంతి పండుగకు ప్రతీ యేటా తప్పనిసరిగా పిండి వంటలు చేయాల్సిందే.సకినాలతో పాటు అరిసెలు, గారెలు, మురుకులు, పిండి వంటలను తయారు చేస్తుంటాము. పిండి వంటలు తయారు చేసే క్రమంలో ఇరుగు పొరుగును పిలుచుకోవడం, వాళ్ల ఇంట్లో తయారీ సమయంలో మేము వెళతాం.



● అతివలకు ప్రత్యేకం.. నోములు

సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు మహిళలు నోముకోవడం ఆనవాయితీ. ఈ ఆచారం తరతరాలుగా వస్తోంది. నేటి తరం వారు కూడా దీన్ని ఆచరిస్తూ పండుగల విశిష్టత, సంప్రదాయ, ఆచార వ్యవహారాలను భవిష్యత్తు తరాలవారికి అందిస్తున్నారు. ఆడపడుచులకు వివాహం కాగానే సంక్రాంతి పండుగకు పుట్టింటి నుంచి నోము తెచ్చుకుంటారు. లేదా అత్తవారింటి నుంచి సంక్రమిస్తుంది. పెళ్లికాని యువతులు వివాహం కోసం, పెళ్లి అయిన వారు సంతానం కోసం, ముఖ్యంగా సౌభాగ్యం కోసం నోముకుంటారు. చుట్టుపక్కల వారందరిని పిలిచి రకరకాల పాత్రలు, బొమ్మలను పంచుతారు. లేదా నోముకున్న వారే ఇంటింటికీ తిరుగుతూ ఇస్తూ ఉంటారు. సంక్రాంతి నోములతో ప్రతీ తెలుగు వారి ఇంట కుటుంబ సభ్యులు, బంధువులతో సందడిగా మారుతుంది. ఏ నోము అయినా ముఖ్యంగా సౌభాగ్యం లక్ష్యంగా చేస్తుంటారు.

సౌభాగ్యవతి నోములు

- బాదం వాణి, సుల్తానాబాద్



సంక్రాంతి పండుగ రోజున సౌభాగ్యవతి నోము నోచుకుంటారు. తమ ముత్తయిదవతనం కలకాలం ఉండాలని ఈ వ్రతం చేస్తారు. ఇందులో నువ్వులు బెల్లంతో నోచుకుంటారు. దువ్వెనలు, అద్దాలు, కాటుక, గాజులు, పసుపు, కుంకుమ వంటి ముత్తైయిదవతనానికి సంబంధించిన వాటితో నోచుకుంటారు. మకర సంక్రమణ రోజే ఇవి నోచుకుంటారు.

కూడారై నోము అత్యంత ప్రధానమైనది


- సౌమిత్రి హరిణి, గృహిణి సుల్తానాబాద్



సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలు నోచుకునే అత్యంత ప్రధానమైన నోము కూడారై నోము వ్రతం.. సంక్రాంతికి ముందే నోముకు సంబంధించిన పనులను పూర్తి చేసుకుంటాము. నూట ఎనిమిది గంగాళాలతో మహిళలు ఈ వ్రతం చేసుకుంటారు. చాలామంది ఎంతో వైభవంగా కూడారై నోములో పాల్గొని తరిస్తారు.

నవజాతి నిర్మాణానికి పునాది

● స్వామి బోధనలు యువతకు దిక్సూచి ● నేడు వివేకానంద జయంతి



సిరిసిల్ల/గణేశ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): "బలమే జీవనం.. బలహీనతే మరణం.. సమస్త శక్తి నీలోనే ఉంది.. లక్ష్యసాధనలో ఎన్ని కష్టాలైనా అనుభవించేందుకు సిద్ధంగా ఉండు.. కానీ విజయాన్ని సాధించేదాకా విడిచి పెట్టకు". అని నిత్యం యువతను ప్రేరేపిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపా రు.. స్వామి వివేకానంద. ఆయన స్వరం ప్రపంచవ్యాప్తంగా యువకుల గుండెల్లో ప్రేరణగా నేటికీ నిలిచి ఉంది. ప్రపంచ దేశాలు స్వామి వివేకానంద అందించిన సూక్తులను యువతకు బోధిస్తూ ఎంతో మందిని ఉత్తేజపరుస్తున్నారు. యువతను మేల్కొల్పడానికి స్వామి వివేకానంద ఆశాజ్యోతిగా కనిపిస్తున్నారు. 39 ఏళ్ల జీవితంలో భారతజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. జనవరి 12న వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

● స్వామి వివేకానంద జీవితం

స్వామి వివేకనంద అసలు పేరు నరేంద్రనాథ్ దత్త. ఆయన తల్లిదండ్రులు భువనేశ్వరిదేవి విశ్వనాథ్ దత్తలు. 1863 జనవరి 12న పశ్చిమబెంగాల్‌లోని కలకత్తా నగరంలో జన్మించారు. రామకృష్ణ పరమహంసకు ప్రియమైన శిష్యుడు స్వామి వివేకానంద. ఎన్నో దేశాలు తిరిగి భారతదేశపు ఆధ్యాత్మిక విలువలని వివరించారు. స్వామిజీ చికాగోలో చేసిన ఉపన్యాసం ఇప్పటికీ చరిత్రలో నిలిచిపోయింది. వివేకానందుడు గొప్ప తాత్వికుడు. తత్వశాస్త్రంలోనే కాక సామాజిక, రాజకీయంగా ఉపయోగపడే బోధనలు చేశారు.

● యువతకు సందేశం

యువశక్తి తలుచుకుంటే సాధ్యం కానిదంటూ ఏదీ లేదని వివేకానందుడు పేర్కొన్నాడు. ఇనుప కండలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం మనసులో ఉన్న యువత ఈ దేశానికి కావాలని వివేకానందుడు కోరుకున్నారు. వజ్ర సంకల్పం కలిగి ఉండాలని సూచించారు. తన అద్భుత ప్రసంగంతో పాశ్చాత్యుల హృదయాలను సైతం చూరగొన్న భారతీయ తత్వవేత్త. యువతను ప్రోత్సహించిన స్వామి వివేకానంద కేవలం ఒక సన్యాసి మాత్రమే కాదు. గొప్ప దేశభక్తుడు, మేధావి, గొప్ప దార్శనికుడు. అందుకే ఆయన భవిష్యత్ తరాలకు మార్గదర్శి అయ్యారు.

వివేకానంద బోధనలు ఇష్టం

సిరి చందన, విద్యార్థిని



స్వామి వివేకానంద బోధనలు, సూక్తులు చాలా ఇష్టం. వీటి ద్వారా శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. సేవాగుణం అలవడుతుంది. విద్యార్థుల కోసం స్వామి వివేకానంద జీవిత విశేషాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తే బాగుంటుంది.

సమాజంలో గౌరవంగా జీవించాలి

లింగంపల్లి మహేశ్వరి, విద్యార్థిని



స్వామి వివేకనంద బోధనలను అలవర్చుకొని గౌరవంగా జీవించాలి. దేశ అభివృద్ధికి వెన్నుముకగా నిలవాలి. పర్యావరణ పరిరక్షణ, అవినీతి నిర్మూలన కోసం పనిచేయాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

వి.శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్



నేటి పోటీ ప్రపంచంలో యువత అడ్డంకులను ఆత్మ విశ్వాసంతో ఎదుర్కోవాలి. ప్రతి ఒక్కరూ వివేకానందుడి బోధనలతో ప్రేరణ పొందాలి. క్రమశిక్షణతో యువత మెరుగైన సమాజం కోసం పాటుపడాలి. స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి.

సాయం కోరితే స్పందించాలి

గాలిపెల్లి కుమార్, కరీంనగర్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి



ఆపదలో ఉన్నవారు సాయం కోరితే యువత తక్షణమే స్పందించాలి. స్వామి వివేకానంద స్ఫూర్తితో ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడుతున్నా. వారి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నా.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● ప్రముఖుల పూజలు

కొండగట్టు అంజన్నను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ లోకాయుక్త జస్టిస్ చింతపల్లి వెంకట్‌రాములు, రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ దంపతులు మొక్కులు చెల్లించుకున్నారు. వేర్వేరుగా కొండపైకి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కు మార్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఏఎస్‌ఐ చిలుక శ్రీనివాస్ ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరి మృతి

బీర్‌పూర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ బావిలో జారిపడి కొల్వాయి గ్రామానికి చెందిన కస్తూరి వెంకన్న (47)అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తుంగూర్ గ్రామ శివారులోగల తన పొలానికి కాలువ ద్వారా నీరు వస్తున్నాయో లేదో చూడడానికి వెంకన్న వెళ్లాడు. ఒడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు.

భూ కబ్జా కేసులో ఇద్దరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడిన సిరిసిల్ల పట్టణం పెద్దూరు గ్రామానికి చెందిన నలేంద్రి బాలరాజు, గంగుల బాలయ్యను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరు శివారులో సర్వే నంబరు 408లో 2.5 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని సిరిసిల్ల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. దర్యాప్తులో బాలరాజు, బాలయ్యపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

వెల్గటూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట స్టేజి వద్ద శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో పలువురికి గాయాలు కాగా క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కిషన్‌రావుపేటకు చెందిన దంపతులు నర్సింహచారి, నాగరాణిలు ద్విచక్ర వాహనంపై చొప్పదండి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కిషన్‌రావుపేట స్టేజి వద్ద వారి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. వరంగల్- రాయపట్నం రాష్ట్ర రహదారిపై కిషన్‌రావుపేట స్టేజీ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను సంక్రాంతి సెలవులకు తీసుక వెళ్లడానికి గోదావరిఖని ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు ఆటోలో వస్తున్నారు. మార్గ మధ్యలో కిషన్‌రావుపేట వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కాల్చివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 83 కేసుల్లో పట్టుకున్న దాదాపు 26కిలోల 437 గ్రాముల గంజాయిని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో శనివారం కాల్చి వేశారు. మానకొండూరు మండలంలోని ఈదులగట్టుపల్లిలో వెంకటరమణ ఇన్సినేటర్స్ కామన్ బయోమెడికల్ వెస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీలో నేషనల్ డ్రగ్ డిస్పోజల్‌లో భాగంగా నిషేధిత గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో తగులబెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీసీఆర్‌బి సీఐ శ్రీనివాస్, ఆర్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.

ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అదనపు అధికారిగా శ్రీవాణి

గణేశ్‌నగర్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శాతవాహన విద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణిని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అదనపు అధికారిణిగా, అర్థశాస్త్ర విభాగపు అధిపతిగా నియమిస్తూ రిజిస్ట్రార్ రవికుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. పారదర్శకంగా విశ్వ విద్యాలయ పరీక్షల నిర్వహణకు కృషి చేస్తానని శ్రీవాణి తెలిపారు.



శ్రీవాణికి నియామక పత్రం ఇస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

ఘనంగా కూడారై వేడుక

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయాల్లో కూడారై వేడుక నిర్వహించారు. మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో సుధాకర్ పాల్గొన్నారు. వావిలాలపల్లి రామాలయంలో కార్పొరేటర్ మేచినేని వనజ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌రావు పాల్గొన్నారు. సప్తగిరి కాలని కోదండ రామాలయంలో చైర్మన్ కె గౌతమరావు, మంకమ్మతోట వేంకటేశ్వర స్వామి ఆలయంలో వ్యవస్థాపక వంశ పారంపర్య ధర్మకర్త పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు. యజ్ఞవరాహక్షేత్రంలో సాతులూరి గోపాలకృష్ణమా చార్యులు, సర్వవైదిక సంస్థానంట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు.

భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈఓ కాంతారెడ్డి పాల్గొన్నారు. విద్యానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాం భద్రయ్య, గుడిపాటి శంకర్‌రెడ్డి, కోశాధికారి డి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మీరయ్య, రాంరెడ్డి, అంజిబాబు పాటు కార్యవర్గం పాల్గొన్నారు. కట్టరాంపూర్ గోదా లక్ష్మీ సమేత వేంకటే శ్వరాలయంలో, జ్యోతీనగర్ వేంకటేశ్వ రాలయంలో, చైతన్యపురి మహాశక్తి ఆలయంలో కూడారై వేడుకలు జరిగాయి. శ్రీపురం కాలనీలో గోదారంగ నాథస్వామి కల్యాణం నిర్వహించారు.

'ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్ర'

సుభాష్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని హాస్టల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రవి, కార్యదర్శి సూర తిరుపతి అన్నారు. శనివారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను జిల్లా వెల్ఫేర్ శాఖ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో కొంతమంది పిల్లలు మధ్యాహ్న భోజనం చేసిన కొద్దిసేపటి తరువాత కడుపునొప్పి, విరేచనాలు అవుతున్నాయని తెలిపారని అన్నారు. రాత్రి సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవు తాయని ముందుగానే పిల్లలను ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి ప్రాథమిక చికిత్సను అందించామన్నారు. రాజకీయ కారణాలతో ఉద్యోగులను బలిపశువులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ సస్పెన్షన్ల విషయాన్ని మంత్రితో చర్చిస్తానని అన్నారు.

వేణుగోపాలశర్మకు పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గణేశ్‌నగర్‌లో శనివారం కరీంనగర్‌కు చెందిన వేద శాస్త్ర పండితుడు మంగళంపల్లి వేణుగోపాల శర్మకు విశిష్ట పురాణ పండిత పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ సంఘ్ చాలక్ డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, సుడా మాజీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు







వాణినికేతన్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న డైరెక్టర్ రేణుక, అచీవర్స్, వింధ్యావాలి పాఠశాలల్లో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. నగరంలోని వాణినికేతన్ పాఠశాలలో ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రేణుక, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ జంగ సునీతా మనోహరరెడ్డి పాల్గొన్నారు. కోతిరాంపూర్ అచీవర్స్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ వేంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు. వావిలాలపల్లిలోని విద్యాధరి పాఠశాలలో జరిగిన వేడుకల్లో చైర్మన్ వేంకటేశ్వరరావు, డైరెక్టర్‌లు మౌనిక, హరిచరణ్‌రావు పాల్గొన్నారు. జాన్సన్ గ్లోబల్ పాఠశాలలో జరిగిన వేడుకల్లో డైరెక్టర్లు మహిపాల్‌రెడ్డి, సింహాచలం హరికృష్ణ, కాంతాల రాంరెడ్డి, వేంకట వరప్రసాద్, వంగల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

● భగత్‌నగర్: నగరంలోని రేకుర్తి, విద్యానగర్, తీగలగుట్టపల్లిలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ (సిబిఎస్ఈ) విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలను చైర్మన్ ఫాతిమారెడ్డి ప్రారంభించారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలి ఉన్నత పాఠశాలలో వేడుకలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళా వైద్యులు ముగ్గులు వేయగా వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రతిష్ఠారావు, డాక్టర్ వినయ్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

● రామడుగు: రుద్రారం గ్రామంలోని గీతాంజలి మోడల్‌స్కూల్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించి హెచ్‌ఎం రాజశేఖర్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుర్రం దేవిక రాజశేఖర్ ఉన్నారు.



సెయింట్‌జార్జ్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

బీఆర్ఎస్‌తో బీజేపీ చీకటి ఒప్పందం

-సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తో బీజేపీ చీకటి ఒప్పందం లేకపోతే కేసీఆర్‌పై లొట్టపీసు కేసైనా ఎందుకు నమోదు చేయలేదని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసమే కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ఉబలాటపడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీపై బండి సంజయ్ అర్థరహిత విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండి తాజొద్దీన్, శ్రావణ్ నాయక్, అర్షమల్లేశం, నర్సయ్య, శబాన మహ్మద్, ఊరడి లత, కవిత, జ్యోతి రెడ్డి, జీవి రమేష్, దన్నసింగ్, మాసుమ్ ఖాన్ పాల్గొన్నారు.

లారీ యజమానుల సంక్షేమానికి కృషి

-మంత్రి పొన్నం ప్రభాకర్ -కరీంనగర్ పట్టణ లారీ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న మంత్రి పొన్నం

కరీంనగర్ రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): లారీ యజమానుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం కరీంనగర్ బైపాస్‌లోని లారీ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కరీంనగర్ పట్టణ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రేగొండ కిషన్, ఉపాధ్యక్షుడు యండి ఖాజామొహినొద్దీన్, షేక్ సర్వర్, కాల్వ మనోహర్ యాదవ్, సహాయ కార్యదర్శులు మతిన్ బిన్ అలీ, మిర్జా వసీ ఉల్లాబేగ్, కే. కనకరాజు, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ సలీం, కోశాధికారి సయ్యద్ మిన్‌హజుద్దీన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని మంత్రి సత్కరించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ లారీ డ్రైవర్లకు డ్రైవింగ్ స్కూల్‌లో మరింత శిక్షణ అందిస్తామని తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులు లర్నింగ్ ట్రైనింగ్ సెంటర్ కావాలని మంత్రికి వినతి పత్రం అందించారు. లారీ డ్రైవర్లలో పేదవారు ఉన్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

ఈకార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రైస్ మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రిన్సిపాల్‌కు అలిశెట్టి పురస్కారం

గణేశ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కల్వకుంట రామ కృష్ణకు జగిత్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో అలిశెట్టి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ ఏవి ఎన్ రాజు, బలగం ఫేమ్ సత్యం, జగిత్యాల నగర పాలక సంస్థ చైర్‌పర్సన్ జ్యోతి తదితరులు రామకృష్ణను ఘనంగా సత్కరించారు.

ముగ్గుల పోటీలు

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 21వ డివిజన్ సూర్యనగర్ కాలనీలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సూర్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు మాధవి, విజయ, సునీత న్యాయనిర్ణేతలుగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజమౌళి, మోహన్ పాల్గొన్నారు.

గోదా కల్యాణం

కరీంనగర్ కల్చరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చల్లా కాంప్లెక్స్‌లో శనివారం వాసవి వనితా క్లబ్, వాసవి కపుల్స్ ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామి కల్యాణం ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా 200 మంది భక్తులకు పాలు, పండ్లు వితరణ చేశారు. కార్యక్రమంలో జి రజిత, పి లావణ్య, వి రజిత, కౌసల్య, జగదీశ్, వేంకటేశ్, అజయ్‌రామ్ తదిరులు పాల్గొన్నారు.

జంక్షన్‌గా కొత్తపల్లి రైల్వే స్టేషన్

(5వ పేజీ తరువాయి)

ద్వారా కాకినాడ పోర్టుకు తీసుకు వెళ్తున్నారు. కాకినాడ పోర్టు నుంచి సముద్ర మార్గంలో చైనాకు గ్రానైట్ రాళ్లు తరలిస్తారు. గ్రానైట్ వ్యాపారం జోరుగా సాగుతుండడంతో కరీంనగర్ రైల్వే స్టేషన్ గూడ్స్ రైళ్లతో నిండిపోతున్నది. గ్రానైట్ రవాణా కోసం కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రానైట్ రవాణాను కొత్తపల్లి రైల్వే స్టేషన్ నుంచే చేసేందుకు అనువుగా ఉండడంతో జంక్షన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రానైట్‌తోపాటు కొత్తపల్లి రైల్వే స్టేషన్‌కు అనువైన స్థలం ఉండడంతో ఇక్కడి నుంచే సరుకు రవాణా వేగవంతంగా చేసే వెసులుబాటు ఉండడంతో జంక్షన్ ఏర్పాటు పనులు చకాచకా సాగిపోతున్నాయి. కొత్తపల్లి రైల్వేస్టేషన్ నూతన హంగులతో జంక్షన్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నది.

● జిల్లాలో రైల్వే అభివృద్ధి

కరీంనగర్‌లో రైల్వేస్టేషన్‌తోపాటు, కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లు ఏక కాలంలో అభివృద్ధి జరుగుతుండడంతో జిల్లా ప్రజలకు రైలు ప్రయాణం వేగం పెంచుకోనున్నది. ఇప్పటికే పెద్దపల్లి-నిజామాబాద్ మధ్య రైల్వే లైన్ పూర్తయి, కొత్తపల్లి మనోహరా బాద్ రైల్వే లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. హసన్‌పర్తి-కరీంనగర్ కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు ముందుకు సాగుతుండడంతో కరీంనగర్‌లో రైల్వే అభివృద్ధి చెందనున్నది. కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ఆదర్శ స్టేషన్‌గా అధునాతన హంగులతో మార్చి నాటికి అందుబాటులోకి తేవడానికి పనులు జరుగుతున్నాయి. గూడ్స్‌తో పాటు, ప్యాసింజర్ రైలు ఈ లైన్ల మీదుగా ఎక్కువ సంఖ్యలో వెళ్లనుండడంతో అన్ని ప్రాంతాలకు రైలు ప్రయాణం సులువు కానున్నది.

విద్యుత్ కార్మికులకు భద్రత పరికరాలు అందజేత

గణేశ్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికులకు జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ మేక రమేష్‌బాబు భద్రత పరికరాలను శనివారం అందజేశారు. సేఫ్టీ ఆఫీసర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎర్త్ రాడ్స్, సబ్‌స్టేషన్ టూల్ కిట్స్, ట్రీ కట్టింగ్ మెషీన్స్, సేఫ్టీ బెల్ట్, సేఫ్టీ జాకెట్స్ వినియోగంపై కార్మికులకు అవగాహన కల్పించారు. విద్యుత్ అంతరాయం ఉన్న ప్రదేశాలకు సకాలంలో చేరుకోవడానికి ఎమర్జెన్సీ వెహికల్‌ని అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ రాజం, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌గౌడ్, కరీంనగర్ టౌన్-2 సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి అవకాశాలు

-బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు

భగత్‌నగర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే వారికి అవకాశాలు ఉంటాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం నగరంలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని 21 మండలాలకు కొత్త అధ్యక్షులతో పాటు, జిల్లా కౌన్సిల్ సభ్యులను వెంకటేశ్వర్‌రావు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమల అంజనేయులు, మేకల ప్రభాకర్‌యాదవ్, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా ఎన్నికల ఇన్‌ఛార్జి గుర్రాల వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, జిల్లా కార్యదర్శి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

'కళాకారుల సమస్యలు పరిష్కరించాలి'

కరీంనగర్ కల్చరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావుకు కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గుండ్ర కృపాదానం వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2000 మంది కళాకారులు పెన్షన్ల కోసం పడిగాపులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌కు దరఖాస్తు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ధ్రువీకరణ తప్పనిసరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ ఇస్తేనే కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు మార్గం సుగమమౌతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహాల్లో కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



గొల్లపల్లిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీకి సొంత భవనం ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ. 20లక్షల నిధులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కృష్ణప్రసాద్, పంచాయతీ రాజ్ డీఈ రవిప్రసాద్, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, గొల్లపల్లి మాజీ సర్పంచ్ రజిత-తిరుపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ అర్థరహిత ఆరోపణలు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ-కార్ రేస్ విషయంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో హైదరాబాద్ గొప్పతనాన్ని పెంచేందుకే అప్పటి మంత్రి కేటీఆర్ ఈ-కార్ రేస్‌ను నిర్వహించారని తెలిపారు. ఏసీబీ దర్యాప్తు సంస్థ వలే వ్యవహరించడం లేదని కేవలం సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు నడుస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కుమ్మక్కై కేటీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో కేటీఆర్‌కు బండికి పోలిక లేదని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి అనేక సంస్థలను హైదరాబాద్‌కు తీసుకవచ్చిన ఘనత కేటీఆర్‌దేనని అన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్న బండి సంజయ్‌కుమార్ ఒక్క రివ్యూ సమావేశం నిర్వహించలేదన్నారు. సరిహద్దు సమస్యలు, విపత్తు, డ్రగ్స్‌పై పోరాటం చేయాలని బండికి సూచించారు. కేటీఆర్‌పై అర్థరహితమైన ఆరోపణలు చేస్తు ఊరుకునేది లేదని హెచ్చరించారు. జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, శాతరాజు యాదగిరి, ఆర్. వెంకట్‌స్వామి, గుర్రం కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో కూడారై ఉత్సవం

ఇల్లందకుంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం వేదబ్రహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ 'ఉలహముండ పెరువాయ్' కూడారై ఉత్సవం (అమ్మవారి నోము) భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా స్వామివారికి పయాసాలు, పరమాన్నాలు తయారు చేసి అమ్మవారి నోమును ఘనంగా చేశారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో కందుల సుధాకర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక రైతాంగానికి సాగునీరు అందించాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతాంగానికి నీరందించకుండా.. ఎల్ఎండీ నుంచి ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఖమ్మం జిల్లాకు నీళ్లు తరలిస్తున్నారని.. ఇక్కడ రైతాంగానికి అన్యాయం జరిగితే రైతులతో కలిసి షెటర్లు పగలగొడుతానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తాను ఖమ్మం జిల్లా రైతులకు వ్యతిరేకం కాదని, హుజూరాబాద్ నియోజకవర్గ రైతాంగానికి నీరందించకుండా ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తుందన్నారు. డీబీఎం 16ద్వారా నియోజకవర్గంలోని రైతాంగానికి నిరందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే తనపై కేసులు పెడుతున్నారన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలో వందశాతం రుణమాఫీ కాలేదని, ఒకవేళ అయినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. సమావేశంలో బండ శ్రీనివాస్, తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, గందె శ్రీనివాస్, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి ఉన్నారు.

హుజూరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 70మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో సునీత, తహసీల్దార్ కనకయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

'కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు'

జమ్మికుంట రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా 30కేసులు పెట్టిందని ఆరోపణలు చేయడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగూరి సదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌ను పేలుస్తానని కౌశిక్‌రెడ్డి మాట్లాడారని, ఆ సమయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. నిన్ను గెలిపించిన ప్రజల కోసం ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడాలని, ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే వచ్చేది ఏం లేదని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

తిమ్మాపూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రజకులపై సినీ నటుడు చిట్టిబాబు చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండలంలోని మొగిళిపాలెంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు దుడ్డేల రాజయ్య, తడిగొప్పుల శ్రావణ్, మైలారం శ్రీనివాస్ ఉన్నారు.

● గన్నేరువరం: సినీ నటుడు చిట్టిబాబు దిష్టిబొమ్మను మండల కేంద్రంలో రజక సంఘం మండల అధ్యక్షుడు మునిగంటి నాగరాజు ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మునిగంటి మొండయ్య, ఓరుగంటి సంపత్, మునిగంటి మల్లయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్ రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామనపల్లి గ్రామ పద్మశాలి సంఘ భవనంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథులుగా కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 168 కోట్లతో చేనేత అభయ హస్తం పథకం, నేతన్న పొదుపు కోసం 115 కోట్ల బడ్జెట్ కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, కూర నరేష్ రెడ్డి, మెరుగు శ్రీధర్, గ్రామశాఖ అధ్యక్షుడు, పద్మశాలి అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్ : పట్టణంలోని చేనేత సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉపేం దర్, యాదగిరి, మహాదేవ్, వెంకటయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, సుమలత, వాణి తదితరులు పాల్గొన్నారు.

● గంగాధర: మరమగ్గాలకు 168 కోట్లు విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి గర్షకుర్తి పాలిస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం వస్త్ర వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు అలువాల విఠోబా మాట్లాడుతూ రాష్ట్రంలోని నేత కార్మికుల స్థితిగతులను అర్థం చేసుకుని సంక్షేమ పథకాలను శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, జౌళి శాఖ మంత్రి నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిప ల్లి సత్యంలకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

● చొప్పదండి : చేనేతకు చేయూత, నేతన్నకు భద్రత, చేనేత భరోసా పథకాలు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చొప్పదండిలో చేనేత అనుబంధ రంగాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అనుమల్ల నర్సయ్య, సిరిపురం జనార్ధన్, కొక్కుల దేవయ్య, యెన్నం మునీందర్, ఇప్పనపెల్లి రాజేశం, అనుమాండ్ల లక్ష్మీరాజం, ఎలిగేటి శ్రీనివాస్, ఏలిగేటి కృష్ణహరి, మరంపల్లి నాగభూషణం పాల్గొన్నారు.

● గన్నేరువరం: రాష్ట్ర ప్రభుత్వం చేనేత, మరమగ్గాల అనుబంధ కార్మికులకు అభయహస్తం కింద నేతన్న పొదుపు, నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాల అమలుకు జీవో జారీ చేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో పద్మశాలీలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు తేల్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు బూర శ్రీనివాస్, వొడ్నాల బలరాం, అంజయ్య, కనుకయ్య, క్రిష్ణహరి, బాలయ్య, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్

గీత కార్మికుడికి గాయాలు

వీణవంక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామంలోని నాగపురి విజయ్ అనే గీత కార్మికుడు గాయాలపాలైనట్లు గీత కార్మిక మండలాధ్యక్షుడు పూదరి విజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం కల్లు తీసుకునే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు మోక జారిపడటంతో తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు. నిరుపేద కుటుంబానికి అతన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కరెంట్ మోటార్ల చోరీ

చొప్పదండి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణ శివారులోని ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ వెంట రైతులు పెట్టుకున్న కరెంట్ మోటార్లను దొంగలు ఎత్తుకుపోయారు. మోటార్ల సాయంతో ఐదుగురు రైతులు వ్యవసాయం చేస్తుండగా మోటార్లను ఎవరో గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయారని రైతు బండారి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.

● సంక్షిప్తం..

● శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వడ్డె ఓబన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రామడుగు: దేశరాజుపల్లి గ్రామంలో మండల ధర్మజాగరణ సమన్వయకర్త పాకాల రాములుగౌడ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సుధాకర్‌రెడ్డి, హన్మత‌రెడ్డి, కిష్టారెడ్డి ఉన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో సొసైటీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు.

● గన్నేరువరం: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ నాయకుడు గూడూరి సురేష్ కోరారు. శనివారం ఆయన వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో తిరుపతి, శేఖర్, ప్రశాంత్ పాల్గొన్నారు.